# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

<u>పత్రికా ప్రకటన</u>

**జూన్ 27, 2011**

## ప్రముఖ మార్క్సిస్టు ఆర్థికశాస్త్రవేత్త, భారత విప్లవానికి గొప్ప మిత్రుడు కామ్రేడ్ ప్రొఫెసర్ ఆర్.ఎస్.రావుకు అరుణారుణ జోహార్లు!

2011 జూన్ 17న ప్రముఖ మార్క్సిస్టు ఆర్థిక శాస్త్రవేత్త, భారత విప్లవానికి గొప్ప మిత్రుడు ప్రొఫెసర్ ఆర్.ఎస్.రావు (74) కొత్త ఢిల్లీలోని ఒక ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన మరణంతో భారత ప్రజలు తమ గొప్ప శ్రేయోభిలాషుల్లో ఒకరినీ, భారత విప్లవం తన గొప్ప మిత్రుల్లో ఒకరినీ కోల్పోయారు. ఆయన మరణం విప్లవ క్యాంపు అంతటా విషాదాన్ని నింపింది. పీడిత ప్రజానీకం పక్షాన, నక్సల్బరీ నాటి నుండీ ఈ దేశంలో చెలరేగుతున్న మావోయిస్టు విప్లవోద్యమంతో దృఢంగా నిలిచిన ఈ అచంచలమైన మార్క్సిస్టుకు సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ వినమ్రంగా అరుణాంజలి ఘటిస్తోంది.

ఆర్.ఎస్.రావు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. ఆయన జీవితంలో అత్యధిక భాగం ఒడిషాలోని సంబల్‌పూర్‌లో గడిచింది. పెద్ద ఆనకట్టల వల్ల విస్థాపనకు గురైన ఈ ఆదివాసీ బహుళ ప్రాంతాన్ని ఆయన తన పనికి ఎన్నుకోవడం అనేదే ఆయనకు అత్యంత పీడితులైన ఈ దేశప్రజల పట్ల గల లోతైన అక్కరకు ఒక సూచిక. ఈ లోతైన అక్కర, పీడిత తాడిత ప్రజానీకం పట్ల, ముఖ్యంగా ఆదివాసుల పట్ల నిబద్ధత అనేవి ఆయనలో చివరి వరకూ కొనసాగాయి. నక్సల్బరీ ఆయన జీవితంలో ఒక మలుపు. భూస్వామ్య దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడే ఉద్యమం మాత్రమే ఈ దేశాన్ని విముక్తం చేయగల్గుతుంది అని ఆయన లోతుగా, దృఢంగా విశ్వసించారు. ఆయన రచనల్లోనూ, ఉపన్యాసాలలోనూ ఆయన మన దేశంలోని అర్ధ–భూస్వామ్య సంబంధాలకేసి దృష్టిని ఆకర్షిస్తూ, వాటి నుండి విముక్తం కావల్సిన అవసరాన్ని ఎత్తిచూపేవారు. మార్క్సిస్టు బృందాల్లో భారతదేశంలో పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించాయా అనే చర్చోపచర్చలు జరిగిన సమయాల్లో ఆయన దేశంలోని ఉత్పత్తి సంబంధాలను మార్క్సిస్టు దృక్పథంతో విశ్లేషించి వాటికిగల అర్ధ–భూస్వామ్య స్వభావాన్ని నొక్కిచెప్పారు. అందుకనే ఆయన ఈ దోపిడీ ఉత్పత్తి సంబంధాలను కూలదోయగల నూతన ప్రజాస్వామిక విప్లవ ఆవశ్యకతను గురించి నిరంతరం విశ్వసించారు, రాశారు. 'టువర్డ్స్ అండర్‌స్టాండింగ్ సెమీ ఫ్యూడల్ సెమీ కలోనియల్ సొసైటీ: స్టడీస్ ఇన్ పొలిటికల్ ఎకానమీ' అనే ఆయన పుస్తకం, ఆయన ఇతర రచనలూ నూతన ప్రజాస్వామిక విప్లవానికై కృషి చేసే సీరియస్ రాజకీయ కార్యకర్తలందరూ తప్పక అధ్యయనం చేయదగ్గవి. సాధారణ కార్యకర్తలూ, ప్రజలూ క్లిష్టమైన ఆర్థికశాస్త్ర పదజాలాన్ని కూడా సామాన్య పదాల్లో వివరించగల ఆయన నైపుణ్యాన్నీ, స్పష్టంగా రాసే శైలినీ మనసుకు హత్తుకున్నారు.

భారత పాలకవర్గాల సామ్రాజ్యవాద నిర్దేశిత అభివృద్ధి నమూనాను ప్రశ్నించిన మొట్టమొదటివారిలో ఆర్.ఎస్.రావు ఒకరు. భాక్రానంగల్, హిరాకుడ్ వంటి భారీ ప్రాజెక్టులు ప్రజలను విస్థాపితులను చేసిన కాలం నుండే ఆయన అభివృద్ధి వెలుగునీడలు అనే భావనను ముందుకు తెచ్చారు. నెహ్రూ పెద్ద ఆనకట్టలను 'ఆధునిక దేవాలయాలు' అన్నప్పుడు ఆయన అవును అవి ఆధునిక దేవాలయాలే, అందుకే అవి కట్టినవారికి వాటిలోకి ప్రవేశం లేదు అన్నారు. ఈ భావనను వివరించిన ఆయన అద్భుతమైన రచన 'అభివృద్ధి వెలుగునీడలు' ఇప్పటికీ దేశం ఎటువంటి అభివృద్ధి నమూనాను అమలు చేయాలి అని జరిగే రాజకీయ చర్చలను ప్రభావితం చేస్తూనే వున్నది. ఆయన అనేకమంది యువ పరిశోధకులకు మార్గదర్శకత్వం వహించారు, గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన సామాజిక, ఆర్థిక పరిణామాలను, ప్రత్యేకించి పాత మావోయిస్టు ఉద్యమ ప్రాంతాల్లో అధ్యయనం చేయమని ప్రోత్సహించారు. ఒక సీనియర్ మార్క్సిస్టుగా ఆయన గతితార్కిక పద్ధతిని ఉపయోగించి దేనినైనా వాటి చలనంలో అధ్యయనం చేయడానికి ప్రయత్నిస్తూ వాటి సారాంశాన్ని గ్రహించే ప్రయత్నం చేశాడు.

ఇటీవల ఆయన మల్కన్‌గిరి కలెక్టర్ వినీల్ కృష్ణ, జూనియర్ ఇంజినీర్ పబిత్ర మాఝీలను బంధించిన సందర్భంగా ఒడిషా ప్రభుత్వానికీ, సిపిఐ (మావోయిస్టు)కూ మధ్య ముగ్గురు మధ్యవర్తుల్లో ఒకరిగా కీలకమైన పాత్రను పోషించారు. తాము వారిద్దరినీ విడిపించగలిగాం గానీ కామ్రేడ్ సీతన్న ఏమైందనే కనీసమైన సమాచారాన్ని కూడా ప్రభుత్వం నుండి రాబట్టలేకపోయాం అనీ, ఇక ప్రభుత్వం ఈ సందర్భంగా చేసిన వాగ్దానాలను నెరవేర్చడం గురించి చెప్పడానికేముంది అనీ ఆయన ఆవేదన చెందారు.

నక్సల్బరీ కాలం నుండి ఆర్.ఎస్.రావు పీడిత ప్రజలకూ, దేశంలోని మావోయిస్టు ఉద్యమానికీ గొప్ప మిత్రుడిగా, శ్రేయోభిలాషిగా వుంటూ వచ్చారు. అనేక రకాల సైద్ధాంతిక చర్చల నేపథ్యంలో, ప్రత్యేకించి సోవియట్ అగ్రరాజ్యం కుప్పకూలిన సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతీఘాతుకులూ, పోస్ట్ మాడర్నిస్టులూ మార్క్సిజం మీద దాడిని ఎక్కుపెట్టిన సందర్భంలో ఆయన ఉద్యమంతోనూ, మార్క్సిజంతోనూ దృఢంగా మొక్కవోకుండా నిలిచారు. ఆర్.ఎస్. రావు వంటి గొప్ప మార్క్సిస్టు తనకు రిఫరెన్స్‌గా సిపిఐ (మావోయిస్టు) అధికార రాజకీయ పత్రికలను భావించేవారు అనేది తనకు గౌరవప్రదమైన విషయంగా మా పార్టీ భావిస్తున్నది. ప్రజాపక్షపాతి అయిన నమూనా మేధావిగా ఆర్.ఎస్.రావు సేవలను సిపిఐ (మావోయిస్టు) కొనియాడుతుంది. ప్రజల ప్రయోజనాలకు విలువిచ్చే ఏ మేధావి అయినా ఆయన నమూనాను అనుసరించాలని భావిస్తున్నది. వారు తమ మేధస్సునూ, రచనాశక్తినీ మన దేశ పీడిత ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడానికి ఉపయోగించాలి. మన దేశ సహజ సంపదలను అడ్డూ ఆపూ లేకుండా దోచుకోవడానికి ప్రజలపై బహుముఖ, దేశవ్యాప్త యుద్ధానికి తెగబడిన ఈ కీలకమైన సమయంలో ఈ అవసరం మరింతగా ముందుకొచ్చింది. భారతదేశ పీడిత ప్రజలు, ప్రత్యేకించి ఆదివాసీ ప్రజలూ ఆర్.ఎస్. రావు చేసిన సేవలను ఎన్నటికీ మరువరు. పాలకవర్గాల విధానాలను నిర్దాక్షిణ్యంగా చీల్చిచెండాడే ఈ మృదుభాషి, కోమల స్వభావం గల మేధావిని వారు ఎల్లప్పుడూ ఆప్యాయంగా గుర్తు చేసుకుంటారు.

యావత్ విప్లవ క్యాంపు తరఫున సిపిఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ భారతిగారికీ, వారి కుటుంబానికీ, స్నేహితులకూ, ఉద్యమ మిత్రులకూ సంతాపాన్ని తెలుపుతున్నది. ఆయన రచనలనూ, ఆయన జీవితంలో ఎత్తిపట్టిన విలువలనూ దేశాన్ని విముక్తి చేయాలని కోరుకునే యువతరం అనుసరించే విధంగా వారు ప్రచారం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నది. విప్లవోద్యమానికి ఆర్.ఎస్.రావు వంటి మేధావులు అందించే తోడ్పాటు దాని మనుగడకూ, అభివృద్ధికీ ఒక కీలకమైన పాత్రను పోషిస్తుంది. ఇటువంటి రచయితలూ, మేధావులూ అందించే తోడ్పాటునూ, సంఘీభావాన్నీ మా పార్టీ మన:స్ఫూర్తిగా మదిలో నిలుపుకుంటుంది. ఆర్.ఎస్.రావుకు అందించగల నిజమైన నివాళి ఆయన తన జీవితంలో పాటించిన, ప్రచారం చేసిన విలువలనూ, ఆదర్శాలనూ అనుసరించడం, దేశంలోని ఉత్పత్తి సంబంధాలను వాటిన మార్చే ఉద్దేశ్యంతో పటిష్టమైన మార్క్సిస్టు దృక్పథంతో అధ్యయనం చేయడం, మన దేశాన్ని భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాద సంకెళ్ల నుండి విముక్తి చేసే లక్ష్యంతో పని చేసే ఉద్యమాలతో దృఢంగా నిలవడమే అవుతుంది. మా పార్టీ ఇటువంటి మేధావుల కృషినంతటినీ నూతన ప్రజాస్వామిక భారతదేశ స్థాపనకై జరిగే మొత్తం కృషిలో భాగంగా చూస్తుంది. ప్రజలకు నిజమైన ప్రజాస్వామ్యమూ, నిజమైన అభివృద్ధీ అందుబాటులోకి రావాలని ఆయన కన్న కలలను నిజం చేయడానికి ఆయన చేసిన కృషినీ, ఆయన ఆదర్శాలనూ కొనసాగించాలనీ ఆయన మిత్రులకూ, సహచరులకూ మేం విజ్ఞప్తి చేస్తున్నాం.

Abhay

**(అభయ్)**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**